


పొద్దు చల్లబడింది.

మనోరంజని దేవునిదగ్గర దీపం వెలిగించి, అన్నానికి ఎసరుపెట్టింది.

ఆఫీసులో పనిచేసి (ఆకొంచరు) అలసి వచ్చిన అతనికి, వేడివేడిగా కొసిపోది అన్నం పెట్టి, ఏ కూరవేసినా (ఆకలి వున్నందున) చాలా రుచిగా వుంటుంది.

పనులన్నీ ముగించి భర్త 'సుశీల్‌రావు' కొరకు ఎదురు చూడసాగింది. ఎనిమిది గంట లవుతుండగా వచ్చాడు. ఐదు గంటలకే ఆఫీసు బందుచేసినా, హెక్టు ఇంటికివెళ్ళి బజారు పనులు చూసి, ఆకొంచెం ఇంట్లో నీళ్ళు తోడి వదకంచేసి వస్తాడు.

ఇంటి ప్రక్కనున్న 'బావ'లోని నీళ్ళు పోసుకొని భోజనానికి కూర్చున్నాడు. అన్నం వడ్డిస్తూ ఆరోజు జరిగిన విషయాలన్నీ చెప్పింది. "బాబు నాలుగడుగులువేసి చతికిల బడ్డాడు" నవ్వింది. స్వచ్ఛంగ వున్న ఆ నవ్వుని వంటాకుంటూ భోజనం ముగించాడు.

"అయ్యో! వంకాయ వేపుడు వదిలేశారు" నొచ్చుకుంటూ అంది.

"నిన్ను చూస్తూ...." ఆ మాట అన్న భర్తవంక చూపింది.

"బాటీకాలర్ షర్టు, బెల్‌బాటమ్ పాంటు వేసుకుంటే కాలేజీ కుర్రాడిలా వుంటాడు" అని వూహించుకుంది.

"ఆరోజు పెళ్ళి చూపులకి వచ్చి కట్నంగా సైకిలు అడిగితే వాళ్ళ ఆశకి తిట్టిపోసింది. ఇప్పుడనిపిస్తుంది ఆశకాదు అవసరమని. ఎలాగైనా సెకండు హేండ్ సైకిలన్నా కొనాలి" అని అనుకొంది.

మనోరంజని చదివింది ఒమ్మిదోక్లాసు. మెట్రిక్ పెయిల్ అని చెప్పకుంటూ చుట్టు పక్కల గుడిసెల పిల్లలకి ప్రవేట్లు చెప్పు తుంది. ఒకటోక్లాసు పిల్లాడికి ఒక్కరూపాయి. ఎన్నోక్లాసు అయితే అన్నిరుపాయలు ఇవ్వ మంటుంది. ఆ పూరిండ్లవాళ్ళు అప్పు తీర్చి వట్లు అక్కడో పావలా అర్ధా నెలంతా ఇస్తుంటారు.

"ఏమిటీ ఆలోచిస్తున్నావ్! అన్నం తినేసిరా చాలా పనుంది." అన్నాడు సుశీల రావ్ కొడుకు ప్రక్కలో చేరుతూ.

ఆ.... చాలా పనేమిటో మనోరంజనికి తెలుసు. వచ్చే నూటయాభై సరిగ్గా తింటే బియ్యానికే చాలవు. ఉంటున్న పూరిల్లు బాడుగ ఇరవై రూపాయలు.

పదిరూపాయలకి తీసుకోవాలంటే ఎప్పు మోల గుడిసె వస్తుంది. సరిగ్గా నిలుచుంటే మనతోపాటే నిల్చుంటుందా గుడిసె. మరో పాపాయి పుట్టితే భరించే శక్తివుందా? ఈ పిల్లాడే బరువు అనుకుంటే. మనస్సు భారమై ఛా! ఛా! నొచ్చుకుంది ఆ తల్లి మనస్సు.

బాబుకి సంవత్సరం నిండుతుండగానే లూప్ వేయించుకుంది. బ్లీడింగ్ మొదలైంది. ముందు వాటిని అమెరికాలో గుర్రాలకి వాడేవారట. వద్దురా బాబు అనుకొంది. మాత్రలు వాడితే ఏవో సైడు అఫెక్టు వస్తున్నాయట! అన్నంలో మజ్జిగ కలుపు కుంటూ "మీరు ఆపరేషన్ చేయించుకో కూడదూ" అంది. బాబు పాదాల్ని నిమురుతూ "పాతిక నిండని నాకెందుకే ఆపరేషన్. నీవు చేయించుకుంటే బెస్టు!" అన్నాడు.

"మీ మగాళ్ళకి ఎంత ముందాలోచన నేను చస్తే మరో పెళ్ళికి ఆటంకమనేగా." నవ్వుతూ అన్నా ఆ గొంతులో దుఃఖం గర మంది.

అతను తలెత్తి, "అదేంమాట మరో చావంటూ వస్తే నీకంటే ముందు పోతా

నేనే. ఆపరేషన్ అంటే భయంవేసి మరిం కేదో అవుతుందని అలా అన్నాను."

'ఈసారి ఫామిలీ ప్లానింగ్ వాండ్లు వస్తే ఆపరేషన్ చేయించుకుంటాను' అని తీర్మా నించుకొంది.

పనులు ముగించి తడిక దగ్గరకువేసి తాడుతోకట్టి పడకదగ్గరకు చేరేటప్పటికి సుశీల రావు గాఢంగా నిద్రపోతున్నాడు. తనలో నవ్వుకొని చాప పరుచుకుంది. వెంటనే నిద్ర పట్టలేదు. తలపులు వెనక్కి పరుగెత్తాయి.

* * *

మనోరంజని ఎలిమెంటరీ స్కూలుమాష్టారి కూతురు. ఆ మాష్టారు దేవుడిచ్చినంతవరకు పిల్లల్ని కన్నారు. ఆడపిల్లల్ని చదివించి ఆ తర్వాత పెళ్ళిళ్ళు చెయ్యాలి. ఆ రెండు చేయ లేని తండ్రి చదువు మానిపించింది. ప్రతి యేటా కంటున్న తల్లికి ఇంటి పనుల్లో సాయం చేయడానికి.

ఎలాగో తొమ్మిదివరకు నెట్టుకొచ్చింది. తాను ఓ గుమస్తాకి భార్యను అవుతానను కొన్నది.

ఇంటర్ పాస్ అయిన బావకి మెడిసన్ సీటు వచ్చింది. 'మనోరంజని అదృష్టవంతు రాలు' అనుకొన్నారంతా. తన బావ డాక్టరు. మనస్సు గోదావరిలా పుప్పొంగిపోయింది. వెనుకబడిన జాతులకిచ్చిన స్కాలర్‌షిప్‌తో తల్లితండ్రుల రెక్కల కష్టంతో చదువు ముగించాడు.

చదువుకి అంటులేదు. (అస్పృశ్యత) పెద్దింటి అమ్మాయి బాగా కట్నంగ డబ్బు పోసి ఆ డాక్టరుని కొనుక్కొంది. బావ గొప్ప వాళ్ళల్లో చేరిపోయాడు.

వెనుకబడిన జాతులను, అంతవరకు అణగద్రొక్కబడిన వారిని కొందరి పుణ్య పురుషుల పుణ్యమా అని ప్రభుత్వం వారి ఉద్ధరణకు పూనుకొంది. వారి పుణ్యఫలితంగ పెద్ద చదువులు - పదవులు దొరికాయి. పైకి వచ్చినవారిపై ధనికవర్గపువారి చూపుపడింది. వారి అమ్మాయిలకి డాక్టర్లు - ఇంజనీర్లు - కలెక్టర్లను కొనిచ్చారు. ఇక్కడా పెట్టుబడి దార్లదే పైచెయ్యి అయింది.

అస్పృశ్యత ఎలాంటిదో, పతనం ఎలాం టిదో చవిచూసినవారు తమ జాతి (బీద) వారిలో ఒకరిని చేపట్టివుంటే అతను ఓ కుటుంబాన్ని ఉద్ధరించినట్లే కదా! ఆ తరం వారిని పైకి లేపినట్లే కదా! స్వార్థం గొప్ప వారి సొత్తుకాదు. అందరిలోనూ వుంది.

చిన్నప్పటినుంచి మనోరంజనికి కాబోయే భర్తగా చెలామణై మరో గొప్పింటి గొప్ప కులంవున్న అమ్మాయి మెడలో మహానం దంగా తాళికట్టి ప్రాక్టీసుపెట్టి అతను రెండు చేతులా ఆర్జిస్తూ వుంటే మనోరంజనికి ఇంకా పెళ్ళికాలేదు.

ఒకానొక శుభసమయాన సుశీలరావు మనోరంజనిని చూసుకోటానికి వచ్చాడు. చూపులు అయిన తర్వాత అతని కోరికలు - (స్కూలు ఫైనల్ పాస్ అయ్యాడు. గవర్న మెంటు ఉద్యోగం. దేవుడు మేలుచేస్తే మరో మంచి ఉద్యోగం దొరుకుతుంది! అని పెద్దలు ఆశ చూపిస్తూ) "వుంగరం, వాచి, సైకిలు, పెళ్ళి బట్టలు, ఖర్చులు. ఆ తర్వాత పెళ్ళి కూతురికి ఏమి పెట్టుకుంటారో మీ ఇష్టం" అన్నారు.

తల వంచుకు కూర్చున్న మనోరంజని నరనరాలలో ఉద్రేకం కట్టలు తెంచుకుంది.

"మా నాన్న ఏ ఉద్యోగం చేస్తున్నది తెలుసు కదా! మా యింటిని ఇంట్లో పిల్లల్ని చూశారుగా - నెలబత్తెం ఆ నెల జీతంతో గడవాల్సిందే. మీ పుట్టుపూర్వోత్తరాలు ఎలాం టివో - మావికూడా అలాంటివే, మేము పూర్లు కోయలేదు. దొంగనోట్లు అచ్చుగుద్ద లేదు. గుద్దివుంటే ప్యూన్‌నేంఖర్మ, ఏ కలె క్టర్నో కొనుక్కొని వుందును. మాలాగే మీరూ పూరిపాకల్లో వున్నవారు. సాటివారి మీద దయ చూపకపోగా, మరో కులం, మరో జాతివాడు మనమీద దయచూపాలని అణగద్రొక్కకూడదని వాపోవడం హాస్యా స్పదంగా లేదూ. ప్రభుత్వ ప్రయత్నాలకి మీలాంటి పైకివచ్చిన యువకులు చేయూతనిస్తే కదా బ్రహ్మకి సార్థకత. చాలు, చాలు. ఇక వెళ్ళండి" అని వారిని బయటికి తరిమినంత పనిచేసింది మనోరంజని.

మూడోరోజు సుశీలరావు ఒక్కడే వచ్చి వాకిట ముందు నిల్చున్నాడు.

గుడిలో పూలదండలు మార్చుకొని, మనో రంజనితో వేరింటి కాపురం పెట్టాడు సుశీల రావు.

* * *

ప్రొద్దున్నే వేడివేడి కాఫీ అందిస్తున్న భార్యవైపు కినుకుగా చూశాడు. "మోసం చేశావు!"

నవ్వును దాచుకుంటూ, "అలా కోపంగా చూస్తారేం! మీరే నిద్రపోయారు" అంది.

"లేపకూడదూ.... అసలు నీకిష్టం లేదని రాదూ." నిష్ఠూరం వేశాడు.

"మీరంటే ఇష్టం నాకు. అందుకే బాబు మీలాగ పుట్టాడు."

మక్కువగా మనోరంజనిని దగ్గరకు తీసు కున్నాడు. ఎంత బంగారం వుంటే మనస్సుకు ఇంత ప్రశాంతత తృప్తి వుంటుంది?

ఉల్లాసంగ ఆఫీసుకు వెళ్ళాడు.

బాబుకి స్నానంచేసి పౌడరు అద్ది, ఉతికిన చొక్కా, సంతలో యాభై పైసలకు కొన్న నిక్కరు తొడిగి గట్టిగా ముద్దుపెట్టుకొంది. తన చిన్నాడిని డాక్టరుచేసి గుడిసెలో పెరిగిన మరో చిన్నారికిచ్చి పెళ్ళిచేస్తుంది. నాన్న గొడ్ల వెంట పరుగెత్తక చదువుకోబట్టే కదా తాను ఈనాడు ప్రపంచం అంటే ఏమిటో? తన చుట్టుప్రక్కల ఏమి జరుగుతుందో గ్రహించగలుగుతుంది!

మనిషిలో అంతర్గతంగా వున్న మాన వత్వం కనీసం మరో ప్రాణికి చేయూత నిమ్మంటుంది. మరో రెండు తరాలకి తన చిన్న కుటుంబం మిద్దెల్లో వుంటుంది. మనో రంజని రేపు చూపిస్తున్న ఆశగా ఆరోజు గడిపేసింది.

ఆ సాయంత్రం రిక్షాలో వచ్చిన సుశీల రావుకు ఆత్రంగా ఎదురై చేయూతనిస్తూ, "ఆ కట్టు ఏమిటి? ఏమైంది" అంది.

"ఏంలేదు. బీరువా మారుస్తుంటే బొటన వ్రేలు చిట్లింది అంతే." అన్నాడు.

ఆరోజు మామూలుగ మందేసే కాంపౌం డరు బొటనవ్రేలు నల్లగ మాడిపోతున్నట్లుంటే 'ఎందుకైనా మంచిది. పెద్దాసుపత్రికి వెళ్ళ' మని సలహా ఇచ్చాడు.

చెవులకున్న ఒకే బంగారు కమ్మలు అమ్మింది. దాచుకున్న చిల్లర తీసుకొని పెద్ద ఆసుపత్రికి బయలుదేరారు. అక్కడ డాక్టరు పరీక్షించి మందులు సూదులు రాసిచ్చారు. ఇంజక్షను వేయించుకొని ఆస్పత్రి బయటికి వచ్చి నిల్చున్నారు. ఉంటానికి చోటుకోసం చూశారు. ఆస్పత్రికి దగ్గర్లో కనుపిస్తున్న

గుడిసెలపై పుకి నడిచారు.

పెద్ద డాక్టరుకి పాతిక రూపాయలు ముట్టితేగాని వార్డులో చేర్చుకోరు అని తెలిసేప్పటికి వారంరోజులు గడచిపోయాయి.

మందులకి, ఇంజక్షన్లకి తిండికిపోను తిరిగి ఇంటికిపోను చార్జీలకి లేదని బెంగ పడ్డారు. అవుట్ పేషంట్లని చూస్తున్న డాక్టరు దగ్గరకి వెళ్ళి ఏడ్చేసింది మనోరంజని. 'పూరుకో! పూరుకో!' అంటున్నా సుశీలరావు గద్దించాడు. ఆ డాక్టరు ఆ గాయాన్ని చూసి కళ్లు పెద్దవిచేసి 'మైగాడ్!' అన్నాడు. వెంటనే అడ్మిట్ చీటీ వ్రాసిచ్చాడు. అడ్మిట్ చీటీ చూసి అడ్మిట్ చేసుకొంటూ, బెడ్ షీట్ వ్రాసిచ్చే పెద్దమనిషి తనకంటె వెనుక వచ్చిన వాళ్ళు వచ్చినట్లే వ్రాయించుకొని వెళతుంటే గమనించి తాను ఒక రూపాయి కాటుగ అందించ్చింది. అవినీతి ఎప్పుడు ఎక్కడ! ప్రారంభమైందో కాని ఇక్కడ బెడ్ షీట్ తీసుకునే దగ్గర మొదలైందని తలుస్తూ సుశీలరావుని నడిపించుకుపోయింది—

అనేకంటే కుంటుకుంటూ వెళ్లాడని చెప్పవచ్చు. వార్డులో నర్సు చూపించే పడకకోసం వరండాలో నిల్చున్నారు. మంచాలు ఖాళీలు లేవు. నేల పడకలు నిండుకున్నాయి. వున్న వాళ్ళని డిశ్చార్జి చేయరు. డబ్బిచ్చి మంచాలు కొనుక్కున్నవారు,మంచాలు వదలరు! మాకు చావుగ వుంది అంటూ మూలుక్కుంటూ నర్సు బాత్‌రూమ్‌కి వెళ్ళే దారిలో ఖాళీ చూపి అక్కడ పరచుకోమని మూలన చుట్టినగోనె పట్టా చూపించింది. దానిలో వుండ చుట్టుకున్న దుప్పటి పరిచింది. రక్తపు మరక ఎండిపోయినా మిర్రి చూసింది


"అమ్మా! సిస్టరమ్మా!" గట్టిగపిలిచింది మనోరంజని.

"మంచిదేలే! అది పరచి, ముందు నీవు బయటికి నడు" అంది.

* * *

రోజూ డాక్టరు వస్తూనే వున్నాడు, చూస్తూనే వున్నాడు. బొటనవ్రేలి నల్లదనం పాదంపైకి పాకింది.

చదువుకోటానికి వచ్చిన పిల్లడాక్టర్లు 'అది గాంగ్రీన్' అదిత్వరలో ఆ కాలు తీసివేయక పోతే ప్రాణానికే ముప్పు అని ఇంగ్లీష్‌లో చెప్పుకుంటుంటే విన్న సుశీలరావు ప్రాణం



విలవిలలాడింది. ఆ పిల్లలకి ఏం తెలుసు? ఏమి తెలియదు! అంతగ ప్రాణాపాయం అయితే పెద్ద డాక్టరు ఎందుకు వూరుకుంటాడు! అని సరిపెట్టుకున్నాడు.

పన్నెండు గంటలకి అన్నంగిన్నె పట్టుకొని మనోరంజని వార్డుకి వస్తుంటే శవాన్ని తీసుకుపోతూ విలపిస్తున్న ఆత్మీయులను చూస్తూ నిలుచుంది.

"పాపం! ఏం జబ్బు!"

"టైఫాయిడ్ జ్వరం!"

"ఈ కాలంలో టైఫాయిడ్ జ్వరం వస్తే చచ్చిపోయేవాళ్ళు వున్నారా? క్షయ-కేన్సర్ లాటి మహారోగాలే నయమవుతున్నాయి."

"సరైన మందు పడితే ఏ రోగం అయినా కుదురుతుంది. ఈ ఆస్పత్రిలో ఎప్పుడు మందులున్నాయి. వాండ్లు కొనుక్కొనే స్థితిలో లేరు. చావురాక ఏ మౌతుంది!"

అందరి మాటలు వింటూ ముందుకు నడిచింది మనోరంజని.

యాభై రూపాయలు వుంటే ఆ మనిషి బ్రతికేవాడు. మనిషి ప్రాణం విలువ యాభై రూపాయలా! ఆ వార్డు డాక్టరు బీరువాలో అంతకంటే విలువైన పానీయాలున్నాయి. యాభై రూపాయలు పెట్టి పేకముక్కలు కొన్నాడు. పిల్లలాంటి తన వార్డు పేషంటుకి ఓ పాతిక ఖర్చుచేసి వుంటే అతడు బ్రతికేవాడు. ఎందరి దగ్గరో తీసుకుంటాడు. ఎవరికో ఒకరికి కాస్త ఖర్చుచేస్తే ఏం! కాస్త ఆలోచించగల ఏ మనిషైనా అనుకుంటాడు.

మనోరంజని వెళ్ళేటప్పటికి డిశ్చార్జి కాయితాలుపట్టుకొని కూర్చున్నాడుసుశీలరావు.

"ఏమిటీ! డిశ్చార్జి చేశారా!" గాబరాగా అంది.

"ఆపరేషన్ చేసి కాలు తీసెయ్యాలట, తయ్యారయ్యి రమ్మన్నారు" భావ గర్భితంగా పలికి, విరక్తిగా నవ్వాడు.

ఆ నవ్వు తన రక్తనాళాలను తెంపినట్లుగా బాధపడి వుబికి వస్తున్న కన్నీళ్ళని ఆపుకోటానికి ప్రయత్నిస్తూ తల ప్రక్కకి తిప్పుకొంది.

* * *

మరునాడు చదువుకొనే పిల్లలకు ఆ పడకపై గాంగ్రీన్ పేషంటు లేకపోవడం ఆశ్చర్యం గొలిపింది. ఆ చచ్చిన భాగం తీసి వేయకుంటే అతను తొందరలో చచ్చిపోతాడు. ఎంత ఇగ్నొరెంట్ మన దేశ ప్రజలు, ఈ రాకెట్ యుగంలో కూడ మూర్ఖంగ వున్నారు! అని స్టూడెంటు డాక్టర్లు మాట్లాడుకుంటుంటే....

"ఆ పిల్లలకి ఏం తెలుసు! తల్లిదండ్రులు పంపిస్తున్న డబ్బుతో చీకు చింత లేకుండ చదువుకుంటున్నారు. ధనమహిమ, సంపాదనలోని రుచి ఇంకా ఎరుగని పసి మనస్సులు. యాభైయిస్తే ఆ బీద వాడికి ఆపరేషన్ జరిగేది. మరో పాతిక ఇస్తే మంచం దొరికేది" అని మూడు వందలు ఇచ్చి కడుపాపరేషన్ చేయించుకున్న మంచం మీద పేషంటు అన్నాడు పక్క-బెడ్ వాడితో.

* * *

నెల తిరగక మునుపే పరిచయస్తులు ఆ ఆసుపత్రిలో మనోరంజనిని చూశారు. అంటు వ్యాధి సోకినదానిలా వున్నది. భయంగా దూరంగా జరిగిపోయారు. చేతికి గాజులు, నుదుట బొట్టు లేక చింపిరి జుట్టుతో, విధవగా వున్న ఆమె భుజంపై బాబును వేసుకొని పిచ్చిదానిలా నడిచిపోతున్నది.

తల్లి తిట్టినా కొట్టినా అన్నం పెట్టక పోయినా తల్లి వాడినే చేరుతుంది. మరో దారి లేదని ఆ బిడ్డ గ్రహించుతుంది మరో గతి లేని బీదవాడు గవర్నమెంటు ఆసుపత్రిలో పోసే నీళ్ళమందుకే వస్తాడు.

చచ్చిపోయిన సుశీలరావు తిరిగిరాడు. బ్రతికున్న బిడ్డని పోగొట్టుకోక కాళ్ళీడ్చుకుంటూ వచ్చింది.

బాబును పరీక్షించిన డాక్టరమ్మ చీవాట్లు వేసింది. "ఇన్ని రోజులు ఏం చేస్తున్నావ్? జ్వరం టైఫాయిడ్‌లోకి దిగింది. పిల్లల్ని పందుల్లా కనగానే సరా? చూసుకోవడం తెలిసి వుండాలి...."

డాక్టరమ్మ మాటలు చెవిలో దూరలేదు. తన దగ్గర డబ్బులేదు. వందరూపాయలు లేక భర్తను పోగొట్టుకుంది. నూరేళ్ళ జీవితం భగ్నమైపోయింది. బాబు లేకపోతే తను లేదు. తను ప్రపంచంలో వున్నా లేకపోయినా ఫర్వాలేదు కాని బాబు వుండాలి. బాబు బ్రతకాలి. జీవుని సృష్టి ఎంత చిత్రమైన కల్పనో చూడాలి. వాడు బ్రతికే తీరాలి."

బాబుని ఎత్తుకొని ఊరంతా తిరిగి పేరు మోసిన పిల్లల స్పెషలిస్టు డాక్టరుకు చూపించి ఆ నర్సింగ్ హోములో చేర్పించింది.


శ్రేష్ఠ

క్రౌన్ మరియు సన్ బ్రాండ్‌లు
సాటిలేని మేలిమి రకంయొక్క మేటి చిహ్నములు



క్రౌన్ మరియు సన్ బ్రాండ్లు ఏభై సంవత్సరాల అనుభవం మరియు సాంకేతిక నైపుణ్యాన్ని ప్రతిబింబించే చిహ్నములు భారత దేశంలో వైశాలికులైన జీవన్‌లాల్‌వారి ప్రతిభను చాటే చిహ్నములు కూడా:

ఈ ప్రపంచమందు ఏ వస్తువునైననూ కొద్ది తక్కువ రకంగా, తక్కువ వెలకు విక్రయించవచ్చు. వెలను మాత్రమే ముఖ్యంగా భావించువారు ఈ వలలో చిక్కుకొనెదరు. కాని తక్కువ రకం కొనుగోలుద్వారా కలుగు ఏమరుపాటు తక్కువ వెల కొనుగోలువలన లభించు సంతోషంకంటె దీర్ఘకాలముండును. — జాన్ రస్కిన్

ఇంటికి ఉపయోగపడే అల్యూమినియం, స్టెయిన్‌లెస్‌స్టీల్ పాత్రలు తయారుచేయువారు

**జీవన్‌లాల్ (1929) లిమిటెడ్**

127, మింట్ స్ట్రీట్, పో. బా. నెం. 1389
మద్రాసు 600 001
కలకత్తా, మద్రాసు, బొంబాయి, హైదరాబాద్, ఢిల్లీ, కొచ్చిన్.


ఏ ధైర్యంతో తానాపని చేసింది? తన దగ్గర ఏముంది? బంగారమా? వెండా?

అన్నిటికంటె విలువైనది, బంగారంతో కొనదగినది....మట్టి శరీరం, తోలుతో కప్పబడివుంది. మాంసపు ముద్దతో మలచబడినందుకు హర్షించింది.

తెల్లటి పడకపై పడుకున్న బాబుకి నర్సు కాపలాగావుంచి చీకటిబజారు నీడల్లోనిల్చింది.

"నా ప్రాణమా? నాకు తెలిసి వుంటే నిన్ను పోగొట్టుకొని వుండే దానిని కాదు." అని భర్తను తలచుకొంది మనోరంజని.

పచ్చని కాయితాలు గుండెలో దాచుకొని వచ్చింది. బల్లని మందులు—పళ్ళతో నింపింది.

డాక్టరు గంటకోసారి లేదా—మనోరంజని కోరినప్పుడల్లా నవ్వుతూ వచ్చి చూస్తున్నాడు.

ఆ జ్వరానికి క్లోరోమైసిన్ వాడేరు. మరింకెన్నో మందులు, సూదులు వేశారు.

జ్వరం తగ్గిపోతుందన్న ధీమాతో డాక్టరు నర్సు-ఆయాలు, మనోరంజని ఇస్తుంటే పుచ్చుకుంటూ మంచం చుట్టూ దేవతల్లా కాపలా కాశారు. కాని సైతాన్ పిచ్చి కుక్కలా నవ్వాడు. బాబు వులిక్కిపడ్డట్టు ప్రాణం వదిలాడు.

స్పెషలిస్టు డాక్టరు తల బద్దలు కొట్టుకున్నంత పని చేశాడు. తన ట్రీట్‌మెంట్ తప్పిపోటానికి వీలులేదు. తన డయాగ్నసిస్ (జబ్బులక్షణం) నూటికి నూరుపాళ్ళు కరెక్టు. తన నర్సింగ్ హోమ్‌కి ఈ మచ్చ వుండకూడదు.

తప్పు ఎక్కడ? ఎక్కడ?

వాడిన మందులన్నీ పరీక్షించాడు. ఆ జర్వానికి సంజీవివంటి క్లోరోమైసిన్ పరీక్షకు పంపాడు. రిపోర్టు వచ్చింది. ముఖ్యమైన క్లోరోఫెన్ ఆ క్యాప్సూల్లో లేదని. భోగస్ మందు తయారీ అని తెలుసుకున్న డాక్టరు తేల్గిగా నిట్టూర్చాడు. 'మందులో లోపం-తన పనిలో కాదు' అని చెప్పాడు.

ప్రాణాధారమైన మందులో కూడా మోసమా? ఎంత దగా? మనిషికి ఎంతటి డబ్బు దాహం?

మనోరంజని తలలో వెయ్యి పిచ్చి కుక్కలు మోరలెత్తి అరుస్తున్నాయి. చనిపోయిన బాబుని గుండెలకు అదుముకొని, వీధిలోకి పరుగెత్తిపోయింది. ★